




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 9-4-2025

సంపుటి: 21 సంచిక: 13

పేజీలు: 8 వెల: రూ.1


# మాయమైన మాలిక్యూల్‌కు ఎక్స్‌పైరీ ప్రమాదం

- కొద్ది నెలలే గడువు.. అలోగా పట్టుకోలేకపోతే కోట్ల నష్టం
- కేసు దర్యాప్తులో కనిపించని పురోగతి.. రంగంలోకి సీఐడీ
- చోరీ చేసినా అమ్ముకోలేకపోతున్న ఆగంతకులు
- వారి యత్నాలకు గండి కొట్టిన 'సత్యం' కథనం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఫార్మా రంగంలో అత్యంత కీలకమైన మాలిక్యూల్ చోరీ కేసు చిక్కుముడి ఇంతవరకు వీడలేదు. మరోవైపు దీన్ని చోరీ చేయగలిగిన ఆగంతకులు.. విక్రయించి సొమ్ము చేసుకోవడంలో మాత్రం విఫలమయ్యారని ఫార్మా వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలోని పైడిభీమవరం వద్దనున్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ నుంచి విలువైన మాలిక్యూల్ మిస్సయిన వెంటనే జిల్లా పోలీసులు రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన దర్యాప్తు చేపట్టినా చోరీ అయిన సరుకును గానీ, అసలు నిందితులను గానీ ఇంతవరకు పట్టుకోలేకపోయారు. కేవలం అనుమానితులను ప్రశ్నించడం వరకే పోలీసులు పరిమితమయ్యారు. ఎటువంటి పురోగతి లేకపోవడంతో ఈ కేసును సీఐడీకి అప్పగించినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల భోగట్టా. ఎందుకంటే డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ రూపొందించిన ఈ మాలిక్యూల్ ఫార్మా రంగంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైనది. టైప్-2 మధుమేహం (షుగర్) ఉన్నవారికి ఇది సంజీవని లాంటిదని చెబుతున్నారు. అటువంటి మాలిక్యూల్ కోట్లు విలువ చేస్తుందని అందరికీ తెలుసు. ఇదే విషయాన్ని సంచలన సాయంకాల పత్రిక 'సత్యం' మార్చి 19న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో జీవితాలను మార్చే మాలిక్యూల్ చోరీ పేరుతో మొదటిసారిగా ఫ్లాష్ చేసింది. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో ఈ మాలిక్యూల్‌ను మార్కెట్‌లో ఫార్ములాగా మార్చే ప్రక్రియకు గండిపడినట్లు తెలుస్తోంది. ఈ మాలిక్యూల్ దాచే వేర్‌హౌస్‌లోకి వెళ్లడానికి యాక్సెస్ కార్డు ఉండాలి. ఇది కేవలం 12 మంది వద్ద మాత్రమే ఉండటంతో ఆ 12 మందిలో ఎవరో కొందరు చోరీచేసి ఉంటారని పోలీసులు భావించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ యాజమాన్యం కూడా యాక్సెస్ కార్డుతో ఓపెనయ్యే లాకర్ ముందు సీసీ కెమెరాలు ఎందుకని పెట్టలేదు. కానీ ఈ దొంగతనం జరిగిన తర్వాత దాదాపు 40 ఎకరాల ఈ కాంపౌండ్ చుట్టూ సీసీ కెమెరాలు బిగించారు. మాలిక్యూల్‌ను ల్యాబ్‌కు తీసుకువెళ్లి దాన్ని ఫార్ములాగా మారిస్తే గానీ అది డ్రగ్‌గా మారదు. ఇప్పుడు దీన్ని ప్రభుత్వ ల్యాబొరేటరీలో పరీక్షించి ఫార్ములా సరిగా ఉందని సర్టిఫై చేయాలి. అలా చేసిన వెంటనే రెడ్డీస్ ల్యాబ్‌కు సమాచారం అందిపోతుంది. ఎందుకంటే డాక్టర్ రెడ్డీస్ ల్యాబొలేటరీస్ చైర్మన్‌గా ఉన్న సతీష్ రెడ్డి రాష్ట్రంలో ఫార్మా రంగాన్ని శాసిస్తున్నారు. ప్రభుత్వంలో కూడా అత్యంత కీలకమైన పదవిలో ఉన్నారు. ప్రధాన పరిశ్రమల సంఘాలు, ప్రభుత్వ ప్యానెళ్లలో చురుకైన సభ్యుడిగా ఔషధ రంగానికి, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన విధానాలను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. అందువల్ల రెడ్డీస్ ల్యాబ్‌లో మాయమైన కోట్ల విలువైన మాలిక్యూల్ ఎక్కడున్నా ఇట్టే తెలిసిపోతుంది. కానీ ఈ మాలిక్యూల్ కాలపరిమితి ఏడు నెలలు మాత్రమే. ఈలోపే దాన్ని ఫార్ములాగా మార్చాలి. అంటే టాబ్లెటా? ఇంజక్షనా? సిరప్పా? అనేది తేల్చాలి. లేదంటే కొద్ది నెలల్లోనే ఈ మాలిక్యూల్ ఎక్స్‌పైర్ అయిపోయి దేనికీ పనికిరాకుండాపోతుంది. ఇదిలా ఉండగా ఈ చోరీ కేసులో ఇద్దరు నిందితులు స్వచ్ఛందంగా లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. సీఐడీ కేసు టేకప్ చేయడంతో ఈ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్లేనని అంటున్నారు.

# ఎక్సైజ్ బాబు మెడకు 'బెల్ట్' బాగోతం!

- బీర్ బాటిళ్లతో పట్టుబడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్
- యూబీ ఫ్యాక్టరీ నుంచి తరలించే సరుకు బెల్ట్ షాపునకు
- సదరు యజమానిని బెదిరించడంతో ఆత్మహత్యాయత్నం
- జిల్లా ఎస్పీని ఆశ్రయించి.. గుట్టు విప్పేసిన అతని భార్య
- పోలీస్ బాస్ ఆదేశాలతోనే హైవేపై తనిఖీ.. జగదీష్‌పై కేసు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని బేవరేజెస్ ఫ్యాక్టరీ నుంచి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బందే బీర్ బాటిళ్లు తరలిస్తూ దొరికిపోవడానికి బెల్ట్ దందా వికటించడమే కారణమని తెలుస్తోంది. తెగే దాకా లాగితే ముప్పు తప్పదని ఈ వ్యవహారంలో మరోసారి స్పష్టమైంది. తప్పు చేస్తున్నది చాలక ఎక్సైజ్ కానిస్టేబుళ్లమన్న బిరుసుతనంతో తమకు సహకరిస్తున్న బెల్ట్ షాపు యజమానినే బెదిరించడం చివరికి వారి పీకకే చుట్టుకుంది. రణస్థలం మండలం బంటుపల్లి వద్ద ఉన్న యునైటెడ్ బ్రూవరీస్ ఫ్యాక్టరీలో శాఖాపరంగా విధులు నిర్వహిస్తూ బీరు బాటిళ్లు తరలించుకుపోతూ పోలీసులకు చిక్కిన ఎక్సైజ్ కానిస్టేబుల్ బొడ్డేపల్లి జగదీష్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నేరుగా పోలీసులకు దొరకడం, కేసు నమోదు కావడంతో ప్రభుత్వోద్యోగుల సర్వీసు నిబంధనల ప్రకారం ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బీరు బాటిళ్ల తరలింపు వ్యవహారంపై 'బీరు కొట్టేస్తున్న ఎక్సైజ్ బాబులు' అన్న శీర్షికతో 'సత్యం' పత్రిక ఈ నెల ఒకటో తేదీన ప్రచురించిన కథనంతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. యునైటెడ్ బ్రూవరీస్‌లో విధులు నిర్వహించే ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఫ్యాక్టరీ నుంచి బీరు బాటిళ్లు పట్టుకుపోవడం, ఆ క్రమంలో జగదీష్ దొరికిపోవడం వెనుక పెద్ద కథే నడిచినట్లు తెలిసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు రోజు విడిచి రోజు పెద్ద సంఖ్యలో బీరు బాటిళ్లు పట్టుకుపోతున్న విషయం ఆ ఫ్యాక్టరీ వర్గాలకు తెలుసు. అయితే ఎక్సైజ్ ఉద్యోగులను తనిఖీ చేసి, బాటిళ్లు తీసుకెళ్లకుండా అడ్డుకుంటే.. ఎక్కడ తమ ఉత్పత్తులపై అనవసర కొర్రీలు పెట్టి ఇబ్బంది పెడతారేమోనన్న ఉద్దేశంతో వారిని సెక్యూరిటీ చెక్ చేయకుండానే పంపించేసేవారు. జగదీష్ బీరు బాటిళ్లు తరలిస్తూ జాతీయ రహదారిపై పోలీసులకు దొరకడానికి ఫ్యాక్టరీ ఉద్యోగులే పోలీసులకు ఉప్పందించడమే కారణమై ఉంటుందని మొదట్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే దీనికి భిన్నమైన కథ ఒకటి ప్రచారంలో ఉంది. రెగ్యులర్‌గా ఫ్యాక్టరీ నుంచి బీర్లు తరలించే జగదీష్‌తో పాటు మరో కానిస్టేబుల్ వాటిని అక్కడికి దగ్గరలో ఉన్న ఓ బెల్ట్‌షాపునకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవారట. ఈ విధంగా సంబంధిత బెల్ట్‌షాపు యజమానికి పెద్ద మొత్తంలో బీర్ బాటిళ్లు సరఫరా చేయడం, వాటి చెల్లింపులకు సంబంధించి బెల్ట్ షాపు యజమాని కానిస్టేబుళ్లకు రూ.3 లక్షలు బకాయి పడటం వల్లే ఈ వ్యవహారం బయటకు వచ్చిందంటున్నారు. బకాయి సొమ్ము వెంటనే చెల్లించకపోతే బెల్టు షాపు - మిగతా చివరి పేజీలో






# నా మాటే శాసనం..!

- మార్కెట్ తరలింపుపై అపోహలు వద్దు
- వ్యాపారులకు మంచి చేయాలనే ఆలోచనతో ఉన్నాం
- జాబితా సిద్ధమైన తర్వాత ముందడుగు
- నిర్మాణానికి నిధులు సమకూర్చి తరలిస్తాం
- ఎమ్మెల్యే గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తన మాటే శిలా శాసనమని, పెద్దమార్కెట్‌లో వ్యాపారుల జాబితా తయారైతే ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేయడానికి ముందుకు వెళతామని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. పెద్ద మార్కెట్ పునర్నిర్మాణ పనుల కోసం ఈ నెల 15 లోగా ఖాళీ చేయించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల మార్కెట్‌లో పర్యటించిన సందర్భంగా అధికారులకు ఆదేశించిడంపై వ్యాపారులంతా బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జాబితా తయారైన తర్వాత అందులో ఉన్న వ్యాపారులందరికీ స్థలాలు కేటాయింపుపై జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తర్వాతనే మార్కెట్‌ను తరలిస్తామన్నారు. మార్కెట్ తరలించేలోగా మూడు రకాల ప్లాన్‌లు తయారు చేయిస్తున్నామన్నారు. వీటిని మార్కెట్ వ్యాపారుల ముందు పెట్టి అందులో ఒక్క ప్లాన్‌కు అందరి సూచన మేరకు ఎంపిక చేస్తామన్నారు. భవిష్యత్తు తరలాకు ఉపయోగపడే విధంగా ఒక మోడల్ మార్కెట్‌కు రూపకల్పన చేస్తామన్నారు. కొనుగోలుదారులు, వినియోగదారులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా మార్కెట్‌ను నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి నిర్మాణం చేపడతామన్నారు. అయితే నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరిన తర్వాతనే ముందడుగు వేస్తామన్నారు. పెద్ద మార్కెట్‌లో వ్యాపారులంతా సమావేశమై మార్కెట్‌లో ఉన్న వ్యాపారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. దీన్ని వ్యాపారుల సమక్షంలో చదివి జాబితాలో చేర్చినవారి పేర్లు చదవి ఫైనలైజ్ చేస్తానన్నారు. జాబితా సిద్ధమైన తర్వాతనే మార్కెట్ తరలింపు ప్రక్రియ ముందుకు సాగుతుందన్నారు. పైరవీలకు అవకాశం లేకుండా పారదర్శకంగా షాపులు కేటాయింపు ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమాలకు అవకాశం ఇవ్వనన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ మార్కెట్‌లోకి వెళ్లి ఖాళీ చేయాలని ఒత్తిడి తెచ్చారని, సమాచారం వచ్చిన వెంటనే ఆయన్ను వెనక్కి పిలిపించినట్టు తెలిపారు.



### నేను మాట్లాడలేదు

మార్కెట్ విషయంలో తాను ఇప్పటి వరకు ఏమీ మాట్లాడలేదన్నారు. అపోహలు నమ్మి ఆందోళన చెందవద్దని వ్యాపారులకు సూచించారు. కల్లబొల్లి మాటలు ఎవరూ నమ్మొద్దన్నారు. అరసవల్లిలో ఆదిత్యుని దేవాలయం అభివృద్ధి పనుల్లో ఏ మాదిరిగా 16 మంది నిర్వాసితులకు భరోసా ఇచ్చి అండగా నిలిచానో అదే మాదిరిగా మార్కెట్‌లో ఉన్న వ్యాపారులందరికీ న్యాయం చేస్తానన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఎప్పటి నుంచో పెద్దమార్కెట్‌కు రావాలని నిర్ణయించినా, సమయాభావం వల్ల తనని వెళ్లి రావాలని సూచించినట్టు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. మార్కెట్‌ను - మిగతా చివరి పేజీలో




• ఎడిటోరియల్

# అంతా మత రాజకీయమే!

వక్ఫ్ బిల్లుకు కాస్త ముందుగా మార్చి 30న ప్రధాని నరేంద్ర మోదీ నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించటం.. బిల్లు గెజిట్ అయిన మరురోజే శ్రీరామనవమి నాడు రామేశ్వరంలో పంబన్ బ్రిడ్జి ప్రారంభించి దాన్ని అయోధ్యతో ముడిపెట్టడం వంటివి ఒక వ్యూహంలో భాగమే. ఔరంగజేబు సమాధికి సంబంధించిన నాగపూర్లో ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి దగ్గర్లోనే అల్లర్లు జరగటం.. కాశీ, మథురల్లో మసీదు-మందిర వివాదాల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొనవచ్చని ఆ సంస్థ కీలక నాయకుడు దత్తాత్రేయ హూసబ్లే కాషాయ జెండా ఊపడం ఒక వరుస క్రమంలో జరిగాయి. మోదీ నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ మూలస్తంభాలైన హెడ్గేవార్, గోల్వాల్కర్‌ల స్మృతిచిహ్నాలను సందర్శించటం కూడా అలా నిర్ణయించుకున్నదే. గతంలో వాటిని సందర్శించిన ప్రధానమంత్రి వాజ్‌పేయి మాత్రమే. పూర్వాశ్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అయిన మోదీ పదవి చేపట్టాక ఈ 11 ఏళ్లలో దాని ప్రధాన కార్యాలయానికి వెళ్లిన దాఖలాల్లేవు. మరి ఇప్పుడే ఎందుకు వెళ్లారు? ఈ మొత్తం పరిణామాల్లో పెద్ద రాజకీయమే ఉంది. మోదీ వ్యవహార శైలి సంఘ పరివార్ పెద్దలకు నచ్చులేదంటూ వచ్చే కథనాలు పరివార్ పాచికలు మాత్రమే. ఆర్ఎస్ఎస్ అనేది సాంస్కృతిక సంస్థ మాత్రమేనని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతో దానికి సంబంధం లేదనే భ్రమను కొనసాగించే ఎత్తుగడ అది. మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన మంత్రివర్గం మొత్తం శాఖల వారీగా ఆర్ఎస్ఎస్ ముందు సమీక్షకు హాజరైందని మర్చిపోకూడదు. 2024 ఎన్నికలకు ముందు దేశానికి హిందూత్వ సంకేతం ఇవ్వడం కోసం అయోధ్యలో రామమందిర సంప్రోక్షణ కార్యక్రమానికి మోదీతో పాటు ప్రస్తుత ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ కూడా హాజరయ్యారు. మోదీ నాగ్‌పూర్ పర్యటన ఆర్ఎస్ఎస్‌తో రాజీకేనన్న ప్రచారం అర్థం లేనిది. 2024 ఎన్నికల్లో మెజారిటీ రాలేదు గనక మోదీని మార్చాలని భావిస్తున్న ఆర్ఎస్ఎస్‌తో సర్దుబాటు కోసమే ఆయన వెళ్లారని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అపహాస్యం చేస్తే.. నాలుగోసారి కూడా మోదీనే ప్రధాని అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ కుండబద్దలు కొట్టడంలో సంకేతం అదే. ఒక హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలను అవకాశంగా తీసుకుని మోదీ సర్కార్ ఇటీవలే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడంపై నిషేధాన్ని ఎత్తివేసింది. చెట్టపట్టాలు వేసుకొని తిరిగే అవకాశం తనకు తానే ఇచ్చుకుంది. కాశీ, మథుర మసీదు-మందిర్ వివాదాల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొనవచ్చని దత్తాత్రేయ హొసబలే చేసిన ప్రకటనను చూస్తే ఆ వివాదాలను తీవ్రతరం చేయాలని సంఘ్ పరివార్ నిర్ణయించుకున్నట్టు స్పష్టంగా అర్థమవుతుంది. అయోధ్య, కాశీ, మథుర.. ఈ మూడు చోట్ల వివాదాలపై ఉద్యమించాలని తాము గతంలోనే అధికారికంగా నిర్ణయించామని హొసబలే గుర్తు చేస్తున్నారు. 1991 నాటి ప్రార్థన స్థలాల చట్టం ప్రకారం అయోధ్య మినహా మరెక్కడా ఇలాంటి వివాదాలకు ఆస్కారం ఉండదు. 1947 ఆగస్టు 15 నాటికి ఆయా ప్రార్థన స్థలాల్లో ఉన్న పరిస్థితిని యథాతథంగా కొనసాగించాల్సి ఉంటుందని ఆ చట్టం స్పష్టం చేస్తోంది. అయినా సుప్రీం కోర్టు కూడా ఇలాంటి పిటిషన్లను విచారణకు స్వీకరించి వివాదాలకు అవకాశం ఇచ్చింది. వక్ఫ్ బిల్లు కూడా వివాదాలకు అవకాశం ఇచ్చింది. వక్ఫ్ బిల్లు నేపథ్యంలో ఇక ప్రతిచోటా వివాదాలు మొదలు కావచ్చు. ఇదేదో ఉత్తరాది సమస్య తప్ప దక్షిణాన, అందులో తెలుగు రాష్ట్రాల్లో ఆ పరిస్థితి ఉండబోదని ఎవరైనా చెబితే అది హాస్యాస్పదమే. ఎందుకంటే ఆలయాల వివాదాలు, మతభేదాల గురించి కీలకంగా మాట్లాడే సనాతనవాద నేతగా ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చారు. తమిళనాడులో అన్నాడీఎంకే మళ్లీ బీజేపీతో చర్చలు ప్రారంభించడం ఒకటైతే.. పవన్ కళ్యాణ్ తమిళంలో ఇంటర్వ్యూలిస్తూ అక్కడ కూడా రాజకీయ మైలేజీ కోసం తాపత్రయ పడుతున్నారు. మీకన్నా మేమే సనాతన ధర్మానికి ఎక్కువగా కట్టుబడి ఉన్నామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా ఒక ప్రకటన చేశారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై సందేహాలు, సంవాదాలను కేవలం వైకాపా-టీడీపీ తగాదాగా, ఘర్షణగా చూపించే ధోరణిలో మంత్రి లోకేశ్ తీవ్ర హెచ్చరికే చేశారు. తెలంగాణలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వంటి వారు దూరంగా ఉన్నట్టు మాట్లాడుతూనే ప్రతి సందర్భంలో మతాల మధ్య చిచ్చు రాజేస్తున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాటలు సరేసరి. వక్ఫ్ నుంచి టీటీడీ వ్యవహారాల వరకూ, నాగపూర్ నుంచి రామేశ్వరం వరకూ ప్రతిదీ వివాదాస్పదమై మత రాజకీయాలను మన ముంగిట్లోకి తెచ్చి నిలబెడుతున్నాయన్న నిజాన్ని అంగీకరించకతప్పదు.

## ఛార్లెట్‌లో ఘనంగా టిడిపి ఎమ్మెల్యేల మీట్ అంట్ గ్రీట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ఛార్లెట్‌లో ఎన్నారై టీడీపీ నాయకులు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు మార్కాపురం ఎమ్మెల్యే కందులనారాయణ రెడ్డి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పార్టీ 43వ ఆవిర్భావదినోత్సవ వేడుకలను కూడా నిర్వహించారు. వర్కింగ్ డే అయినప్పటికీ దాదాపు 200మంది ఛార్లెట్ ఎన్నారైలు పాల్గొన్నారు. చార్లెట్‌లోని వెడ్డింగ్టన్ రోడ్డులో ఉన్న బావార్చి ఇండియన్ గ్రిల్ రెస్టారెంట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశంపార్టీని అప్పటి కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీరామారావు స్థాపించారన్నారు. ఈరోజు అమెరికాలో ఇన్ని లక్షలమంది తెలుగువాళ్ళు ఐటీ రంగంలో ముందున్నారంటే అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే కారణమన్నారు. ఆయన విజనరీ ఏ రాజకీయవేత్తకి లేదని ఆయన తన ప్రసంగంలో ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో మళ్ళీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, ఆయనకు ఎన్నారైలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్నికల సమయంలో పార్టీని గెలిపించేందుకు ముందుకువచ్చినట్లే రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిబాటలో పయనింపజేసే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతికోసం పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని కోరారు. మరో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కూడా ఎన్నారైలు రాష్ట్ర ప్రగతికోసం ముందుకు రావాలని కోరారు. చంద్రబాబు చేస్తున్న పనులకు, పథకాలను మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఛార్లెట్ ఎన్నారై టీడీపీ స్థానిక నాయకులు నాగ పంచుమర్తి, ఠాగూర్ మల్లినేని, రమేష్ ముకుళ్ళ, సతీష్ నాగభైరవ, రాజేష్ వెలమల మరియు ఇతర ఎన్నారై టీడీపీ కార్యవర్గ సభ్యులు సమన్వయపరచారు. కార్యక్రమంలో ఎన్నారై టీడీపీతోపాటు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)




కేంద్ర బీజేపీ కూటమి ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్ బండను మోస్తూ వినూత్నంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలను తగ్గించి ఆ ఫలితాలు అందించాలి కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్‌పై రూ.50లు పెంచడం దారుణమన్నారు. గతంలో రూ.400లు ఉండే సిలిండర్ ధర రూ.880లకు పెరిగిందని దీనివల్ల ఉజ్వల పథకం లబ్దిదారులు, సాధారణ వినియోగదారులకు పెద్దభారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57శాతం పెంచడంతోపాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందన్నారు. కార్పోరేట్ కంపెనీలకు లక్షలకోట్లు రాయితీలిస్తూ రాష్ట్రంలోని వినియోగదారులపై ఏడాదికి రూ.400కోట్ల భారం మోపుతుందన్నారు. గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖాజానాను నింపుకునే పనిలో ఉందన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.2లు చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో తాజా పెంపుతో లీటర్ పెట్రోల్‌పై రూ.13/-లు, డీజిల్‌పై రూ.10లు అమల్లోకి రానుందన్నారు. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇందనాలపై 9సార్లు సుంకాన్ని పెంచిందన్నారు. దీంతో కేంద్రం రూ.99వేల కోట్ల ఆదాయం సమాకూర్చుకొందని విమర్శించారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజలు మద్దతుతో పోరాటాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, స్థానిక నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, బి.రాము, టి.రామారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధంగా గ్రామసభలను నిర్వహించాలి

(సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట)

గ్రామసభలను రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని ప్రజాస్వామ్యం పరిరక్షణ ఐక్యవేదిక మండల కమిటీ జిల్లా శాఖ కార్యదర్శి పెద్దకోట వెంకటరావు, మండల శాఖ కార్యదర్శి చింతాడ రామశంకర్రావు గౌరవాధ్యక్షులు ఎంకే మిశ్రాలు కోరారు. ఈమేరకు బుధవారం ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామసభలను రాజ్యాంగబద్ధంగా నిర్వహించి గ్రామసభల ప్రాధాన్యతను తెలియజేయాలని వారు కోరారు. గ్రామసభలు రోజురోజుకూ తమ ప్రాధాన్యతను కోల్పోతున్నాయన్నారు. గ్రామసభల గూర్చి ముందుగా వివిధ సాధనాల ద్వారా ప్రధాన కూడళ్ల వద్ద ప్రచారం నిర్వహించి ఎక్కువ మంది జన సమీకరణ చేసినట్లు గ్రామస్థాయి అధికారులను ఆదేశించాలని కోరారు. ఒకే సమయంలో అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు జరగటం వల్ల అధికారులు పూర్తిస్థాయిలో హాజరవడానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. గ్రామసభకు హాజరుకాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.



## టీడీపీ సభ్యత్వాల్లో మచిలీపట్నం టాప్‌టెన్

### - అక్కుపల్లి రాజాను అభినందించిన మంత్రులు

(సత్యంన్యూస్, మచిలీపట్నం)

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మచిలీపట్నం నియోజకవర్గం టాప్ టెన్‌లో నిలిచింది. ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో క్లస్టర్-10కు కన్వీనర్‌గా ఉన్న శిష్టకరణ సంఘ నాయకులు అక్కుమహంతి రాజా విశేష కృషి చేసి అత్యధిక సభ్యత్వాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్‌లు రాజాతోపాటు ఉన్న కార్యవర్గాన్ని అభినందిస్తూ దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవలు పార్టీకి అందించాలని సూచించారు. రాబోవు రోజుల్లో రాజాకు తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు.





## కళ్యాణ్‌రామ్ హఠాత్తుగా స్పీడెందుకు పెంచినట్టు

డెవిల్ తర్వాత ఏడాదికి పైగా గ్యాప్ తీసుకున్న కళ్యాణ్ రామ్ అర్జున్ సన్నాఫ్ వైజయంతితో రెడీ అవుతున్నాడు. విడుదల తేదీ అధికారికంగా ప్రకటించనప్పటికీ డిస్ట్రిబ్యూషన్ వర్గాలకు ఏప్రిల్ 18 సిద్ధం కమ్మని సమాచారం వచ్చిందట. కాకపోతే అఫీషియల్ గా అనౌన్స్ చేసే ముందు మరోసారి చర్చించుకోనున్నట్టు సమాచారం. అనుష్క ఘాటీ ఆ డేట్ నుంచి తప్పుకున్నాక ఆ అడ్వాంటేజ్ ఇద్దరు తీసుకున్నారు. ఒక రోజు ముందు తమన్నా ఓదెల 2ని రంగంలో దించుతుండగా మరుసటి తేదీకి ప్రియదర్శి సారంగపాణి జాతకం వచ్చేస్తోంది. ఈ రెండింట్లో ఒకటి డివోషనల్ హారర్ కాగా రెండోది ఎంటర్ టైన్మెంట్ మూవీ. సో మాస్ కు సరైన ఆప్షన్ లేదు. అందుకే కళ్యాణ్ రామ్ ఈ అవకాశాన్ని వాడుకోవాలని చూస్తున్నట్టు సమాచారం. ఏప్రిల్ 18 మంచి ఆప్షన్. పిల్లలు సెలవుల్లో ఉంటారు. థియేటర్లకు ఫీడింగ్ బాగా జరిగే సీజన్ ఇది. మొన్న మ్యాడ్ స్క్వేర్ చూశాంగా. వీకెండ్ మూడు రోజులు కలెక్షన్లు లాగేసి బ్రేక్ ఈవెన్ అందుకుంది. అర్జున్ సన్నాఫ్ వైజయంతిలో ఉన్నది ప్యూర్ మాస్ కంటెంట్. విజయశాంతి రూపంలో బలమైన మదర్ సెంటిమెంట్ పెట్టారు. ఫైట్లు, పాటలు, యాక్షన్ ఎపిసోడ్లు ఒకటేమిటి అన్ని మసాలాలు ప్రాపర్ గా కుదిరాయి. ట్రైలర్ కట్ అయిపోయింది. డేట్ లాక్ చేసు కుంటే ఇది ఎక్కడ లాంచ్ చేలేనిది నిర్ణయించుకుంటారు. నిజానికి సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్ తర్వాత టాలీవుడ్‌లో సరైన మాస్ సినిమా రాలేదు. కోర్ట్, మ్యాడ్ స్క్వేర్, తండేల్ విజయం సాధించినా వాటి టార్గెట్ ఆడియన్స్ వేరు. వాళ్లనే అవి మెప్పించాయి. కానీ అర్జున్ సన్నాఫ్ వైజయంతికి మాస్ ఎడ్జ్ ఉంది. కాకపోతే సినిమాలో కంటెంట్ రొటీన్ అనిపించకుండా అందరికి కనెక్ట్ అవ్వాలి. కళ్యాణ్ రామ్ రంగంలోకి దిగి ప్రమోషన్లు పరిగెత్తిస్తున్నాడు. అనిల్ రావిపూడితో కలిసి తాను, విజయశాంతి కాంబోలో ఒక ఇంటర్వ్యూ చేయించుకున్నాడు. మరికొన్ని ఈ వారంలో జరగబోతున్నాయి. దేవర తర్వాత నందమూరి ఫ్యాన్స్ కోసం వస్తున్న థియేటర్ మూవీ ఇదే.

## మంచు సోదరుల వార్ రీస్టార్ట్!!




మోహన్‌బాబును ప్రశాంతంగా ఉండనిచ్చేందుకు కుమారులు ఇద్దరూ సిద్ధంగా ఉన్నట్లుగా లేరు. కాస్త రోడ్డున పడకుండా ఉండి అందరూ మర్చిపోతున్నారని అనుకుంటున్న సమయంలో మరోసారి పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో సోదరుడు మంచు విష్ణు పై ఫిర్యాదు చేసిన మంచు మనోజ్ కేసు పెట్టారు. తాను ఇంట్లో లేనప్పుడు తన కారుతోపాటు వస్తువులను దొంగిలించాడని ఫిర్యాదు చేశారు. జల్ పల్లిలో ఇంటిలో కూడా 150 మంది చొరబడి విధ్వంసం చేశారని ..తన ఇంటిలో ఉన్న విలువైన వస్తువులతో పాటు కార్లను ఎత్తుకొని వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఇంటి చోరీ అయిన కార్లు విష్ణు ఆఫీసులో ఉన్నాయని.. నా ఇంట్లోకి గోడలు దూకి వచ్చి కార్లను ఎత్తుకొని వెళ్లారని మనోజ్ ఆరోపించారు. తన కుమార్తె బర్త్ డే వేడుకల కోసం తాను రాజస్థాన్‌కి వెళ్లానని ఆ సమయం చూసుకుని విష్ణు ఇంట్లో విధ్వంసం చేశాడన్నారు. నా ఇంట్లో జరుగుతున్న పరిణామాలపై తండ్రి మోహన్‌బాబుతో మాట్లాడేందుకు ప్రయత్నించాను కానీ.. మాట్లాడడానికి అందుబాటులోకి రాలేదన్నారు. తనకు న్యాయం చేయాలని పోలీసుల్ని కోరారు. మంచు సోదరులిద్దరి మధ్య గిల్లికజ్జాల స్థాయి నుంచి పెద్ద స్థాయి గొడవల వరకూ వెళ్లాయి. ఈ సమస్యలను పరిష్కరించుకోకుండా రోజూ ఏదో ఓ గొడవ పడటం ద్వారా పరువు పోగొట్టుకుంటున్నారు.రేపు ఆవేశంలో ఏదైనా దారుణాలకు పాల్పడితే చింతించాల్సి వస్తుందని, పరిష్కరించుకోవాలని పెద్దలు సలహాలు ఇస్తున్నా ఈ వివాదాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..

## చూపు తిప్పనివ్వని సికాకుళం చిన్నది

తెలుగు ప్రేక్షకులు సిద్దు ఫ్రమ్ సికాకుళం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మంజరి ఫడ్నిస్. తెలుగులో ఈమె చేసిన సినిమాలు తక్కువే అయినా, ఈ మధ్య కాలంలో ఈమె తెలుగు సినిమాల్లో కనిపించకున్నా ఈమె గతంలో చేసిన పాత్రల కారణంగా తెలుగు ప్రేక్షకులు గుర్తు పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో ఈమధ్య కాలంలో ఈమె రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తోంది. ఆకట్టుకునే అందంతో పాటు, ఈమె నటనకు పలు సినిమాలతో మంచి మార్కులు పడ్డాయి. అందుకే ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతున్నా ఇప్పటికీ ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉంది. 2004లో హిందీ సినిమా రోక్ సాకోతో రోక్‌లో తో మంజరి ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. ఆ సినిమాతో పెద్దగా గుర్తింపు దక్కనప్పటికీ తన అందం కారణంగా ఆఫర్లను సొంతం చేసుకుంది. తెలుగులో ఈమె మొదటి సారి సిద్ధు ఫ్రమ్ సికాకుళం సినిమాతో 2008లో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో తెలుగులో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లను సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఆమె తెలుగులో నటించిన కొన్ని సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అయితే ఈమెకు ఎక్కువ శాతం మెయిన్ హీరోయిన్ పాత్రలు దక్కక పోవడంతో పాటు, స్టార్ హీరోల సినిమాల్లో ఆఫర్లు దక్కక పోవడంతో నిరాశే మిగిలింది. టాలీవుడ్‌లో వరుసగా నిరాశే మిగలడంతో ఆఫర్లు కనుమరుగు అయ్యాయి. అయితే ఈమెకు తెలుగులో మిస్ అయిన ఆఫర్లు హిందీ నుంచి వచ్చాయి. బాలీవుడ్‌లో క్రమం తప్పకుండా చిన్నా చితకా సినిమాల్లో నటిస్తూ వచ్చింది. మధ్య మధ్యలో కన్నడ సినిమాలు, మరాఠీ సినిమాలను సైతం ఈమె చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 5 లక్షలకు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న మంజరి తన అందమైన ఫోటోలతో ఆకట్టుకుంటూ ఉంది. తన ఫాలోవర్స్‌కి రెగ్యులర్‌గా వినోదాన్ని అందిస్తున్న ఈమె మరోసారి ఈ ఫోటోలతో వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు, మరోసారి ఈమె తన గురించి మీడియాలో చర్చ జరిగేలా చేసింది. రింగుల జుట్టుతో అందమైన బ్రా లెస్ ఔట్ ఫిట్‌తో మంజరి ఫడ్నిస్ చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయిలో అందంగా ఉన్నప్పటికీ మంజరికి రావాల్సిన గుర్తింపు దక్కలేదు. దక్కాల్సిన ఆఫర్లు దక్కలేదు అంటూ పలువురు అభిప్రాయం చేస్తున్నారు. జానే తు యా జానే నా మంచి విజయం సాధించడంతో ఇప్పటికీ బాలీవుడ్‌లో ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. గత ఏడాది సైతం ఈమె నటించిన సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఒక హిందీ సినిమాతో పాటు ఒక మరాఠీ సినిమాను ఈమె చేస్తుందని తెలుస్తోంది. త్వరలోనే ఆ సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతున్నప్పటికీ ఈ స్థాయిలో క్రేజ్ దక్కించుకోవడం ఈమెకే చెల్లింది. ఇకపై అయినా ఈమెకు వరుస ఆఫర్లు దక్కాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. - తుపాకి.కామ్ సౌజన్యంతో...



## హోంమంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

**- వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



లింగమయ్య హత్యను కుటుంబ తగాదా అంటూ చెప్పడం హోంమంత్రికి ఏమాత్రం తగదని, అది బాధిత కుటుంబాన్ని అవమానపరచడంతోపాటు పోలీసు దర్యాప్తుపై ప్రభావం చూపే ప్రయత్నం కూడా ఉంటుందని వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా స్పందించారు. హోంమంత్రి వంగలపూడి అనిత శ్రీకాకుళం జిల్లాలో మంగళవారం పర్యటించి, మీడియాతో మాట్లాడిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డాడు. “లింగమయ్య హత్య ఒక రాజకీయ కుట్రలో భాగమని, ప్రజల ముందు జరిగిన హత్యను కుటుంబ వివాదంగా చిత్రీకరించడం బాధాకరమన్నారు. జగన్ బాధితులను పరామర్శించడాన్ని విమర్శించడం మానవత్వానికి విరుద్ధం” అని కృష్ణదాస్ వ్యాఖ్యానించారు.

**అధికారంలో ఉన్నవాళ్లు దిశా దృష్టి కోల్పోయారు**

“ఒక రాష్ట్ర హోంమంత్రి పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా మాట్లాడాలి తప్ప అనిత వ్యాఖ్యలు చూస్తే, ఆమె హోం మంత్రిగా కాకుండా టీడీపీ నాయకురాలిగా మాట్లాడినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దాంతో ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు.

**వాస్తవాలు దాచే ప్రయత్నం**

“ఇది స్పష్టంగా రాజకీయ హత్యని, ఇప్పుడదాన్ని దారి తప్పించే ప్రయత్నం జరుగుతోందని, అసలు విషయాలు బయటకు రాకుండా చేయాలన్నది అధికారపక్ష లక్ష్యంగా కనిపిస్తోందని కృష్ణదాస్ విమర్శించారు. దర్యాప్తు పూర్తయ్యేలోపు అధికార ప్రతినిధులు ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు.

**జగన్‌కి ప్రజల మద్దతు ఉన్నందుకే భయపడుతున్నారు**

“వైకాపాపై విమర్శలు చేస్తూ ప్రజల దృష్టి మళ్లించాలనే ప్రయత్నం జరుగుతోందని, జగన్ నాయకత్వాన్ని తక్కువచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కానీ ప్రజలు నిజాయితీని గుర్తిస్తారని, మిగతా వారు మాటలతో మాయచేస్తే, జగన్ పనితో నమ్మకం కలిగించారన్నారు.

‘సత్యం’లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221



శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం గ్రామంలో కొండపై వెలసిన ఉమా ఆటకేశ్వర కొండమ్మ జాతరలో భాగంగా నిర్వహించిన ఆటకేశ్వరా కొండమ్మ కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## ఘనంగా పందిరిరాట

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

మొండేటివీధిలో వెలసిన లలితా దేవి సహిత శివ కామేశ్వర వారి ఆలయంలో గల షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సీతా రాముల స్వామి వారి కళ్యాణం మహోత్సవ సందర్భంగా బుధవారం పందిరిరాట నిర్వహించారు.



## జయంతోత్సవాలను జయప్రదం చేయండి

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**

పూలే జయంతి సందర్భంగా ఈనెల 11 నుంచి అంబేద్కర్ జయంతి సందర్భంగా 14వరకు దళిత,పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించే జయంతోత్సవాలను జయప్రదం చేయాలని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాకోటి రాంబాబు, దుప్పాడ రాజులు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళం రూరల్ మండల పరిధి చింతాడలో కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్, పూలే మహనీయుల ఆశయ సాధనకు దళిత, పీడిత, మత మైనార్టీలు ఐక్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆదాని, అంబానీ సేవలే తప్ప ప్రజలను అప్పుల పాలు చేస్తూ సగటు మనిషి బ్రతకడమే ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో జైభీం యువజన సంఘం నాయకులు ముచ్చ జగన్, ముక్కు రమణ, మల్లేసు, రామయ్య, తోట గణేష్, రాగోలు అర్జున రావు, తోట రామకృష్ణ, చలమయ్య, నీలమ్మ, ఎర్రమ్మ, భీష్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**

33/11 కేవీ ఆమదాలవలస ఇండోర్ సబ్-స్టేషన్ పరిధిలో గల కనుగులవలస ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించడానికి, మరమ్మతుల కోసం ఈనెల 11న ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు కనుగులవలస, వెంగళరావు కాలనీ, గేట్ ఏరియా, పాత ఆమదాలవలస, టీఎస్సార్ కాలేజ్, రావికంటిపేట, కుద్దిరాం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని దీనికి ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

## పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

**- మండుటెండల్లో విధి నిర్వహణ**

**- ప్రధాన కూడళ్లలో మంచినీటి కూలర్ల ఏర్పాటు**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రజలకు రక్షణ కల్పించడంలోనూ, సుఖమయమైన జీవనాన్ని సాగించేందుకు అన్నివిధాలుగా సహాయపడుతున్న పోలీసులు వారి ఆరోగ్యం పట్ల మాత్రం శ్రద్ధ వహించడం లేదని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ కోరారు. చేబోలు రామకుమార్, సుకన్య దంపతుల సౌజన్యంతో పోలీసుల సౌకర్యార్థం నగరంలోని రామలక్ష్మణ జంక్షన్, డే అండ్ నైట్ కూడలి, తహశీల్దార్ కార్యాలయం పక్కన తదితర ప్రధాన కూడళ్లలో మంచినీటి కూలర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే వేసవిని దృష్టిలో పెట్టుకొని 41రోజులపాటు ప్రతీరోజూ ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణి చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సీఐ నాగరాజు కోరిక మేరకు కూలర్లును కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శాంతిభద్రతల రక్షణలో పోలీసుల పాత్ర చాలా కీలకమైనదని, వారి త్యాగాలు వెలకట్లలేనివని సూర్యనారాయణశర్మ, ఫణి కుమార్‌శర్మ అన్నారు. అందుకే పోలీసులు, పోలీసులు వ్యవస్థ అంటే తమకు అపారమైన గౌరవమని చెప్పారు. కార్యక్రమంలో వారితో పాటు కస్తూరి సంతోష్, సాయి, రాజేష్‌బాబు, గుప్తలు పాల్గొన్నారు.




## ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడండి

**(సత్యంన్యూస్, ఆమదాలవలస)**

కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సిఐటియు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపుపై సిఐటియు ఆధ్వర్యంలో ఆమదాలవలసలో పారిశ్రామికవాడ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలను తగ్గించి ఆ ఫలితాలు అందించాలి కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్‌పై రు.50లు పెంచడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో రూ:400/-లు ఉండే సిలిండర్ ధర రూ:880/-లకు పెరిగిందని దీనివల్ల ఉజ్వల పథకం లబ్దిదారులు, సాధారణ వినియోగదారులకు పెద్ద భారం పడుతుందని మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ:2/-లు చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో తాజా




పెంపుతో లీటర్ పెట్రోల్‌పై రూ:13లు, డీజిల్‌పై రూ:10లు అమల్లోకి రానుందన్నారు. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇందనాలపై 9సార్లు సుంకాన్ని పెంచిందని దీంతో కేంద్రానికి రూ.99వేల కోట్ల ఆదాయం సమాకుర్చుకొందన్నారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొడ్డేపల్లి జనార్ధనరావు బి.సూర్యనారాయణ, బి.హేమసుందర్, బి.రమణమూర్తి, జి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్‌ధరకు వ్యతిరేకంగా నిరసన

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సిపిఎం శ్రీకాకుళం నగర కమిటీ ఆధ్వర్యంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినా, వినియోగదారులపై భారం మోపడం అన్యాయమన్నారు. గ్యాస్ సిలెండర్లు సబ్సిడీపై ప్రజలకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం 14.2 కేజీల సిలిండర్ పై రూ.50 పెంచడం దుర్మార్గమని దుయ్యబట్టారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువులపై ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే, దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.ప్రసాదరావు, నాయకులు ఆర్.ప్రకాశరావు, బి.గోవర్ధనరావు, కె.సూరయ్య, ఎ.సత్యం, ఎ.సోమశేఖర్, ఎం.ఆది నారాయణ మూర్తి, ఎల్.మహేష్, పార్వతీశం, బి.కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మందస సత్యసాయిమందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 42మందికి కంటిపరీక్షలు నిర్వహించగా, 23 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ నిమిత్తం శ్రీకాకుళం తరలించారు. కార్యక్రమంలో సత్యసాయిమందిర్ కన్వీనర్ ఈశ్వరరావు, సేవాదళ్ సభ్యులు రామారావు, శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం కె.అరుణకుమారి, సోమేశ్వరరావు, నేత్రవైద్యాధికారి రోణంకి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, మందస**




## తుపాను షెల్టర్స్‌ను నిర్మించండి




**(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)**

మత్స్యకార గ్రామాల్లో మల్టీపర్పస్ తుఫాన్ షెల్టర్లను నిర్మించాలని గొల్లగండి గ్రామ మత్స్యకార సొసైటీ అధ్యక్షులు, జనసేన నాయకులు గండుపల్లి చిన్నరాజారావు కోరారు. ఈమేరకు సోంపేట మండలంలో గల మత్స్యకారులు, సంఘ నాయకులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన సమన్వయకర్త దాసరి రాజులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై కూటమి ప్రజాప్రతినిధులు అధికారాలకు ఆదేశాలు జారీ చేయడంతో శ్రీకాకుళం ఫిషరీస్ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ క్షేత్ర పరిశీలన నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మండల పరిధిలో ఇసకలపాలెం, గొల్లగండి, కొత్తూరు, ఎకువూరు, బట్టుగల్లూరు, నడుమూరు, ఎర్రముక్కం గ్రామాలు పూర్తిగా సముద్రానికి ఆనుకొని ఉన్న గ్రామాలన్నారు. ఆయా గ్రామాలలో సుమారు 35 సంవత్సరాల క్రితం సైక్లోన్ షెల్టర్ నిర్మించారన్నారు. ప్రస్తుతం ఆ సైక్లోన్ షెల్టర్స్ చాలా గ్రామాలలో శిథిలావస్థలో ఉన్నాయన్నారు. మండల పరిధిలో ఉన్న గ్రామాలు సముద్ర తీర ప్రాంతానికి ఆనుకొని ఉండడం వలన తుఫాన్లు సంభవించిన సమయంలో ఆయా గ్రామాలలో ఉన్న ప్రజలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా సురక్షిత ప్రాంతాలకు లేదా తుఫాన్ సెంటర్స్‌లకు రిలీఫ్ ఆపరేషన్లు భాగంగా తరలించడానికి మండల కేంద్రంలో ఉన్న భవనాలకు తీసుకుని వెళ్తుంటామన్నారు. గ్రామాలలో నూతన మల్టీ పర్పస్ సైక్లోన్ సెంటర్స్ నిర్మాణం చేయడం వలన ఆయా గ్రామాలలో నివసిస్తూ ఉన్న ప్రజలు, ఆయా గ్రామానికి ఆనుకుని ఉన్న గ్రామాలలో ఉన్న ప్రజలకు తుఫాన్లు సంభవించిన సమయంలో చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం కూడా అందజేశారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ఈ అంశంపై సమగ్ర నివేదిక తమకు అందజేస్తే ఆ నివేదికను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు త్వరగా నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. డైరెక్టర్ సత్యనారాయణతోపాటు డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్‌లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గండుపిల్లి దండాసి, గండుపల్లి గంగయ్య, గోవింద, ధర్మరాజు, గండుపల్లి మీనారావు, సాగూరు గురుమూర్తి, గుండుపల్లి ఈశ్వరరావు, సాగూరు హరి, సాగూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ అవయవం అందజేత

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నిస్సహాయ నిరుపేదలకు కృత్రిమ అవయవం ఎవరికి అవసరమున్న ఉచితంగా అందజేస్తామని అరసవల్లికి చెందిన లయన్ కళ్లేపల్లి ఉషారాణి బుధవారం అన్నారు. అరసవల్లికి చెందిన పట్టా సత్యం అనే నిరుపేద వయోవృద్ధునికి కృత్రిమ అవయవం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతుల మీదుగా స్థానిక పీఎన్ కాలనీలోగల వినాయక దేవాలయంలో అందించి మాట్లాడుతూ నిస్సహాయ, నిరుపేదకు బుధవారం కృత్రిమ అవయవాన్ని అందించటం సంతోషకరమన్నారు. కళ్లేపల్లి ఉషారాణి చొరవతో ఈ మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టటం హర్షణీయమన్నారు. లయన్స్‌క్లబ్ హర్షవల్లి సభ్యురాలైన ఉషారాణి గతంలో కూడా కృత్రిమ అవయవాలను అందించిన విషయం గుర్తు చేశారు. అలాగే ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కలక్టర్ సూచనలమేరకు కృత్రిమ అవయవ శిబిరాన్ని నిర్వహిస్తామని, అందుకు ఉషారాణి కూడా తమ సహకారం అందిస్తామన్నారు. అనంతరం కళ్లేపల్లి ఉషారాణి మాట్లాడుతూ సాటి వికలాంగురాలిగా అలోచించి పేదలకు కృత్రిమ అవయవాలను సుమారు గత 15సంవత్సరాల నుండి అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఎవరికి కృత్రిమ అవయవం కావాలన్నా ఉచితంగా అందిస్తామన్నారు. ఉచితంగా కృత్రిమ అవయవాలను విజయనగరం గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తామని కావలసిన వారు కళ్లేపల్లి ఉషారాణి (8332836356), రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్ (97016 98408) లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, బాధిత కుటుంబ సభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధి బృందం, ఆలయ సభ్యులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

## ఎంటీఎస్‌లకు
# మార్చి నెల జీతాల్లేవ్

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న డీఎస్సీ 2008, డీఎస్సీ 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు మార్చి నెల జీతాలు ఇంతవరకూ పడలేదు. దానికి కారణం తెలుసుకునేందుకు స్థానిక మండల రీసోర్సు కార్యాలయాన్ని సంప్రదించగా తొమ్మిదవ తేదీ వరకు జీతాల బిల్లు పెట్టలేదని తెలిసింది. ప్రతి నెలా చివరి వారంలో ఆన్‌లైన్‌లో జీతాల బిల్లు పెట్టవలసి ఉంది. అయితే నూతన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎవరికీ ఆన్‌లైన్‌లో బిల్లలు పెట్టడం కుదరలేదు. ఆర్థిక శాఖ అనుమతులు ఈ నెల మొదటి వారంలో వచ్చాయి. దాంతో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగులందరి జీతాల బిల్లులు ముందుకు కదిలాయి. రెండో వారంలో కూడా టెక్కలి మండలం విద్యాశాఖ మేలుకోలేదు. ఏళ్ల తరబడి నిరీక్షణ తర్వాత ఉద్యోగాలు పొందిన 2008, 1998 డీఎస్సీ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్‌పై రూ.32 వేలు వేతనం అందుకుంటున్న వారు మొదటి వారంలో జీతం చేతికి అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీతాల బిల్లును పర్యవేక్షిస్తున్న మండల విద్యాశాఖ అధికారి తులసిరెడ్డి బుధవారం వరకు బిల్లు పంపకపోవడానికి కారణం తెలియడం లేదు. రెగ్యులర్ ఉద్యోగుల విషయంలో ఇలాంటి పొరపాటు జరగకుండా ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడి అధికంగా ఉంటుంది. ఎంటీఎస్‌లకు సరైన సంఘాలు లేని కారణంగా ఎంఆర్‌సీలో వారి గురించి పట్టించుకునేవారు లేరు. సీనియారిటీని పట్టించుకోకుండా తన ఇష్టానుసారం డెప్యుటేషన్ విధులు అప్పజెప్పినా పెద్దగా పట్టించుకోని ఎంటీఎస్ ఉద్యోగులు తమ జీతాల బిల్లు పెట్టడంలో మండల విద్యాశాఖాధికారి తీవ్ర నిర్లక్ష్యం చేస్తుండడంతో తమ ఇబ్బంది ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు సదరు ఎంఈవో దుందుడుకు విధానాలపై ఇప్పటికే పలుమార్లు జిల్లా యంత్రాంగానికి సైతం ఫిర్యాదులు చేసారు. తనకున్న రాజకీయ పలుకుబడితో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఆయన పనితీరుపై ఇప్పటికీ జిల్లాకు చెందిన మంత్రివద్ద అనేక ఫిర్యాదులు ఉన్నట్టు సమాచారం.

## వినాయక మందిరం పునర్నిర్మాణానికి
# రూ.10వేలు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలోని తోట వీధి వినాయకమందిరం పునర్ నిర్మాణానికి శ్రీపాద సురేష్, చందు సోదరులు రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పన్నాల నర్సింహమూర్తి, చెముడిపాటి సన్యాసి రావు, పార్నంది విజయకుమార్ పాల్గొన్నారు.



# నా మాటే శాసనం..!

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించిన సమయంలో ఎదురైన అనుభవాలు, అక్కడ నెలకొన్న పరిస్థితులను అంచనా వేశానన్నారు. మార్కెట్‌కు ఒక మంచి రూపం తీసుకురావాలని వ్యవసాయ, మార్కెట్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి ఎప్పటి నుంచో ఒక ఆలోచన ఉందని, బడ్జెట్‌లో అందుకు అవసరమైన నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఇటీవల మార్కెట్‌లో పర్యటించి ఈ నెల 15లోగా మార్కెట్‌లో అందరు వ్యాపారులను ఖాళీ చేయించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారని, అయితే ఆయన చెప్పిన తేదీ నాటికి ఖాళీ చేయించడం సాధ్యం కాదని అందరికీ తెలుసన్నారు. వీలైనంత తొందరగా ఖాళీ చేస్తే పనులు త్వరితగతిని పూర్తిచేయడానికి అవకాశం ఉంటుందన్న ఆలోచనతో మంత్రి అచ్చెన్నాయుడు ఈ నెల 15వ తేదిని నిర్ణయించారని, అదే రోజుకు ఖాళీ చేయాలని వ్యాపారులపై ఒత్తిడి తేవడం లేదన్నారు. మార్కెట్ అభివృద్ధికి మంచి అవకాశం వచ్చిందని, దీనిపై వ్యాపారులంతా కలిసి ఒక నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వైకాపా నాయకులు ఐదేళ్లు మార్కెట్‌ను పట్టించుకోలేదని, వైకాపా నాయకులు సవతి తల్లిప్రేమను నమ్మొద్దని వ్యాపారులకు సూచించారు.

**నేను పక్కా లోకల్**

తాను పక్కా లోకల్ వ్యక్తినని, ప్రజల మధ్యే 24 గంటలూ అందుబాటులో ఉంటున్నానని, రాజకీయాల్లోకి డబ్బులు సంపాదించడానికి, అధికారదర్పం చూపించడానికి, విలాసాలు చేయడానికి రాలేదన్న విషయం గుర్తించుకోవాలన్నారు. 'నన్ను గెలిపించాలని కోరాను, గౌరవించి భారీ మెజార్టీతో గెలిపించారు. గెలిపించినందుకు అందరికీ మంచి చేయాలనే దృక్పధంతో పని చేస్తున్నాను. నేను అక్రమాలకు పాల్పడడం లేదు, నేను ఎవరి భూములు ఆక్రమించుకోలేదు, సెటిల్మెంట్‌లు చేయడం లేదు, ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయడం లేదు. ఎమ్మెల్యే అయిన తర్వాత ఎంతోమందికి వ్యక్తిగతంగా సాయం అందించాను. సాయం అందుకున్నవారికి తెలుసు నేను చేసానని' అంటూ ఎమ్మెల్యే శంకర్ భావోద్వేగంతో మాట్లాడారు. ఎవరి మాటలూ నమ్మొద్దని, నేరుగా తనని కలిసి మాట్లాడాలని సూచించారు. సమావేశంలో పెద్ద మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు కోరాడ హరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.






# ఎక్సైజ్ బాబు మెడకు 'బెల్ట్' బాగోతం!

**మొదటిపేజీ తరువాయి**

నడుపుతున్నందుకు కేసులు నమోదు చేస్తామని భయపెట్టడంతో పాటు దొంగతనం కేసు కూడా నమోదు చేస్తామని సదరు కానిస్టేబుళ్లు హెచ్చరిస్తూ నిత్యం ఒత్తిడి తేవడంతో బెల్టుషాపు యజమాని కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో ఆయన భార్య జిల్లా పోలీసు బాస్‌ను కలిసి జరిగిన తతంగమంతా పూసగుచ్చినట్టు చెప్పేసింది. అంటే ఎస్పీ స్వయంగా రణస్థలం పోలీసులతో దీనిపై నిఘా పెట్టించడంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ జగదీష్ దొరికిపోయారని తెలిసింది. వాస్తవానికి జగదీష్ కాకుండా అక్కడ సుదీర్ఘ కాలం నుంచి పని చేస్తున్న రెండో కానిస్టేబుల్‌ను పట్టించాలని భావించారు. కానీ ఆ రోజు జగదీష్ దొరికిపోయాడు. ఇది జరిగిన తర్వాత నుంచి యూబీ ఫ్యాక్టరీలో ఎక్సైజ్ ఉద్యోగులను కూడా తనిఖీ చేస్తున్నారట. సెక్యూరిటీ సిబ్బందికి ఎక్సైజ్ సీఐలు ఇద్దరు సహకరిస్తున్నా.. ఒక కానిస్టేబుల్ మాత్రం తననే చెక్ చేస్తారా అంటూ వీరంగం వేస్తున్నట్టు భోగట్టా. వాస్తవానికి యూబీ ఫ్యాక్టరీలో విధులు నిర్వర్తిస్తున్న ఎక్సైజ్ అధికారుల దగ్గర నుంచి కానిస్టేబుల్ వరకు అందరూ బీర్లు పట్టుకుపోవడం కామన్. ఉన్నతాధికారులు ఫ్యాక్టరీ తనిఖీకి వచ్చిన ప్రతిసారీ సార్‌కు ఇవ్వాలంటూ ఎక్సైజ్ వాహనాల్లో బీరు కేసులు తరలించుకుపోవడం షరా మామూలే. అయితే ఏరోజూ ఈ విషయాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోలేదు. కానీ ఎప్పుడైతే బెల్టుషాపునకు సరుకు ఇచ్చి సమాంతరంగా ఒక వైన్‌షాపును వీరిద్దరూ నడిపారో అప్పుడే ఈ వ్యవహారం బయటకొచ్చింది.

## ఎవరి మెప్పు కోసమో
# కేసుల్లో ఇరుక్కోవద్దు

### - హోంమంత్రి వంగలపూడి అనిత -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ఎవరి మెప్పుకోసమో యువత కేసుల్లో ఇరుక్కోవద్దని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా శ్రీకాకుళం విచ్చేసిన ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతీ జిల్లాకు ఐదు శక్తి టీమ్‌లు నియమించామని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా ఫిర్యాదుదారులకు న్యాయపరమైన సేవలు అందిస్తున్నామన్నారు. సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లు రాష్ట్రవ్యాప్తంగా మూడే ఉన్నాయని, ముఖ్యమంత్రి అనుమతితో అన్ని జిల్లాలకు ఒక్కొకటి చొప్పున సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే మాత్రమేనని, ఎమ్మెల్యేలకు వన్ ప్లస్ వన్ భద్రత కల్పిస్తున్నామని, కనీసం ప్రతిపక్ష హోదా లేని జగన్మోహన్ రెడ్డికి ఎలాంటి భద్రత తగ్గించకుండా జడ్‌ప్లస్ కేటగిరీ కల్పించామన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ సేవలను ఆమె ప్రశంసించారు.

పీడీ యాక్ట్ అమలు ద్వారా నేర నియంత్రణ అరికట్టగలుగు తున్నామన్నారు. యువత, విద్యార్థులు దుర్వ్యసనాలకు లోనుకాకుండా స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో సీసీ కెమెరాలతో పాటు నిఘా ఏర్పాటు చేశామన్నారు.

# ప్రజాధనం వృధా చేయడమే అభివృద్ధా?

### - మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరానికి ఒక స్థాయిలో మార్కెట్ నిర్మాణం జరిపితే, దాన్ని ఇప్పుడు పడగొట్టేసి కొత్త భవనాలు నిర్మిస్తామనడం ప్రజాసొమ్ము వృధా చేయమేనని, ఇదే కూటమి పాలకుల దృష్టిలో అభివృద్ధా అని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి ప్రశ్నించారు. శ్రీకాకుళంలో మార్కెట్ ఏర్పడిన నాటి నుంచి వసతులు లేక, అందులోకి అడుగు పెట్టాలంటేనే భయపడిపోయే స్థితిలో ఉన్న పొట్టి శ్రీరాములు మార్కెట్‌ను కోట్లాది రూపాయలు వెచ్చించి తాము నిర్మించామని, ఇప్పుడు దాన్ని కూలగొట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. ఈమేరకు బుధవారం 'సత్యం'తో మాట్లాడుతూ తాము నిర్మించిన భవనాలు కూలిపోతున్న స్థితిలో ఉంటే, వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నామని చెప్పినా బాగుంచేదని, బలంగా ఉన్న భవనాలను కూలదోసి ఇప్పుడు అదే ప్రాంతంలో కొత్త భవనాలు కడతామనడం ప్రజాధనాన్ని వృధా చేయడమేనన్నారు. ఆధునిక వసతులతో సమగ్ర కలెక్టరేట్ నిర్మాణానికి ధర్మాన ప్రసాదరావు మంత్రిగా ఉన్నప్పుడు నిధులు తెస్తే దాన్ని కుదించేసి అస్తవ్యస్తంగా కొత్త కలెక్టరేట్‌ను నిర్మించినా ఇప్పటికీ అందుబాటులోకి కూటమి ప్రభుత్వం తేలేకపోయిందని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపు కేఆర్ స్టేడియం పూర్తి చేస్తామని చెప్పి ఇంతవరకు పూర్తి చేయలేదని, ఇప్పుడు మార్కెట్‌ను కూలదోసి ఎప్పటికిస్తారో చెప్పగలరా అని ఆమె ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌లో వ్యాపారులెవరూ కొత్త భవనాలను కోరుకోవడంలేదని, ఇప్పుడు మార్కెట్‌ను మళ్లీ నిర్మించడం కోసం వేరే చోటకు తరలిపోవాలంటే వారెవరూ సిద్ధంగా లేరన్నారు. ఈమేరకు మార్కెట్‌లో వర్తకులంతా తనను కలిశారని, వర్తకులకు నష్టం కలిగించే చర్యలు ఆపకపోతే ఉద్యమ మోడ్‌లోకి మారుతామని ఆమె హెచ్చరించారు. కోవిడ్ వల్ల రెండేళ్లు మార్కెట్‌లో



వ్యాపారం లేక వ్యాపారస్తులు నష్టపోయారని, ఇప్పుడిప్పుడే పెద్ద మార్కెట్‌లో నిలదొక్కుకుంటున్నారని, ఇటువంటి సమయంలో వారిని వేరే చోటకు తరలిస్తే శాశ్వతంగా వ్యాపారాలు మానుకోవాల్సి ఉంటుందని ఆమె అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పెద్దఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా గత వైకాపా




పాలనలో పరిష్కారం కాని ఎన్నో సమస్యలతో ప్రజలు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలసత్వం వహించకుండా తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఆదిత్యుని కల్యాణం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చైత్రశుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం రాత్రి 7 గంటలకు స్వామివారి వెండి అశ్వవాహనాలపై తిరువీధి నిర్వహించారు. అనంతరం రాత్రి 8.30 గంటలకు సూర్యనారాయణ స్వామికి శ్రీ ఉషాపద్మినీఛాయాదేవీలతో కల్యాణ మహోత్సవం, తర్వాత అగ్ని ప్రతిష్టాపనం, ప్రవేశ హోమం జరిపినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.




రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం శ్రీకాకుళం విచ్చేసిన సందర్భంగా ఎస్పీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గొండు శంకర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. వీరితోపాటు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కలమట వెంకట రమణ, టీడీపీ నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## కజికిస్తాన్ ఎంబీబీఎస్ చదువులో..
# ఏజెన్సీ పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

### - పోలీసుల అదుపులో నిందితుడు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విదేశాల్లో ఎంబీబీఎస్ చదివించడానికి పంపించి.. ఫీజులు చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. జిల్లాలో ఏడుగురు విద్యార్థులను కజికిస్థాన్‌లోని ఆస్థానా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఇప్పించిన నేపథ్యంలో ఏజెన్సీకి విద్యార్థుల తల్లిదండ్రులు జమచేసిన మొత్తాన్ని యూనివర్సిటికీ చెల్లించకుండా మోసం చేసిన వైనం వెలుగులోకి వచ్చింది. తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన గంగరాపు హరీష్ ఫ్లై ఎబ్రాడ్ సర్వీసెస్ ఏజెన్సీ ద్వారా జిల్లాకు చెందిన ఏడుగురు విద్యార్థులను కజికిస్థాన్‌లోని ఆస్థానా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు చేయించారు. ఏడుగురు విద్యార్థులు కజికిస్థాన్‌లో యూనివర్సిటీలో క్లాసులకు హాజరవుతున్నారు. ఒప్పందం ప్రకారం యూనివర్సిటీకి చెల్లించాల్సిన టెర్మ్ ఫీజులను హరీష్ తన ఏజెన్సీలకు జమ చేయిస్తున్నట్టు తెలిసింది. ఆ ఫీజులను ఏజెన్సీ ద్వారా యూనివర్సిటీకి చెల్లించకపోవడంతో ఏడుగురు విద్యార్థులను ఆస్థానా యూనివర్సిటీ ఇటీవల ఇంటికి పంపించేసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు ఫ్లై ఎబ్రాడ్ సర్వీసెస్ ఏజెన్సీ నిర్వాహకుడు గంగరాపు హరీష్‌కు నోటీసులు ఇచ్చారు. అయినా ఆయన స్పందించకపోవడంతో లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు. దీంతో కజికిస్థాన్‌కు పారిపోతున్న హరీష్‌ను ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని జిల్లా పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది. నిందితుడ్ని కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని రెండో పట్టణ పోలీసులు న్యాయమూర్తిని బుధవారం కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.